క్లుప్తంగా

'డబుల్' ఇళ్లను పంపిణీ చేయాలి

రెంజల్(బోధన్): గరీబోళ్ల సొంతింటి కలను నిజం చేసేందుకు గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అధికారులు వెంటనే ప్రారంభించాలని కళ్యాపూర్ సర్పంచ్ కాశం నిరంజని సాయిలు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాల కిందట గ్రామంలో 30 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, అధికారులు అప్పట్లోనే అర్హులను ఎంపిక చేశారని గుర్తుచేశారు. వారం రోజుల కిందట అధికారులు గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందిస్తే వాటిని శుభ్రం చేసుకున్నారని పేర్కొననారు. అధికారులు వెళ్లి వారిని కబ్జా చేశారని బలవంతంగా ఖాళీ చేయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డబుల్ ద్రూం ఇళ్లలో సరైన సౌకర్యాలు లేవని, ప్రారంభానికి ముందే కిటీకీలు, పైప్‌లైన్‌లు, డోర్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, అధికారులు జాప్యం చేస్తే నిరుపయోగంగా మారుతాయని పేర్కొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ విగ్రహాలతో ఆలయ పరిసరాల్లో పల్లకీసేవ నిర్వహిస్తామన్నారు. అలాగే అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా సిద్ధులగుట్టపై ఉన్న రామాలయంలో పెద్ద ఎత్తున దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రాముడి జీవితం మానవాళికి ఆదర్శం

నిజామాబాద్‌అర్బన్: రాముడి జీవితం మానవాళికి ఆదర్శం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలో శ్రీ రామ కృష్ణ విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయలను నేర్పించాలన్నారు. విద్యతోపాటు రామాయణం, మహా భారతం వంటి సారాంశాలను పిల్లలకు బోధించాలన్నారు. అనంతరం రాముడు, హనుమంతు, సీత వేషధారణలో ఉన్న చిన్నారులతో ఎమ్మెల్యే ఫొటోలు దిగారు. ప్రిన్సిపాల్ శశిరేఖ, టీచర్లు శ్రీనివాస్, మధుసుదన్ పాల్గొన్నారు.

2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

సిరికొండ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దవాల్గోట్‌లో ఆదివారం పీవైఎల్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఉద్యోగాల నియామకాలలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను అరికట్టాలన్నారు. నాయకులు ప్రేమ్‌సింగ్, బాలకిషన్, వినోద్, రాజశేఖర్, సురేష్, సాగర్, హరికృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

దంత వైద్యశిబిరం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగర శివారులోని బోర్గాం(పి)లో ఆదివారం వజ్ర దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు సంతోష్ కుమార్ పలువురికి దంతవైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యశిబిరంలో చికిత్స పొందిన వారికి 50శాతం రాయితీపై దంత మార్పిడి చేస్తామన్నారు. అవసరమైన వారికి టూత్‌పేస్టులు, మందులు ఉచితంగా అందజేశారు. గ్రామస్తు లు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేఖర్, నాగభూషణం, దశరథ్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

సిరికొండ: మండలంలోని రావుట్ల, న్యావనంది, మైలారం గ్రామాల్లో సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పర్యటించనున్నట్లు డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ నరేశ్, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

పూర్తయిన వంతెన నిర్మాణం

- సుమారు ఆరేళ్లపాటు కొనసాగిన పనులు
- ఎట్టకేలకు నిర్మాణం పూర్తి
- దూరమైన దూదిగాం రైతుల కష్టాలు


కాలువపై నిర్మించిన వంతెన

బాల్కొండ: ఆరేళ్ల పాటు ఆగుతూ.. సాగుతూ.. కాంట్రాక్టర్లు మారుతూ.. సర్వత్రా చర్చనీయాంశమైన వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఏది ఏమైనా కాకతీయ కాలువపై వంతెన నిర్మాణ పనులు పూరత్తికావడంతో మెండోరా మండలంలోని దూదిగాం రైతుల కష్టాలు దూరమయ్యాయి. కాలువ అవతలివైపు ఉన్న వ్యవసాయ భూముల్లోకి సులువుగా వెళ్తున్నారు. కాకతీయ కాలువ అవతలి వైపు సుమారు 300 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. గతంలో ఆ భూముల్లోకి వెళ్లాలంటే జాతీయ రహదారి 44 నుంచి వచ్చి కాకతీయ కాలువ దాటి వెళ్లాల్సి వచ్చేది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాల బారిన పడేవారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. అయితే నాటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ ఉండడంతో ఒక దశలో వంతెన నిర్మాణ పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాకతీయ కాలువపై ప్రాజెక్ట్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటేనే వంతెన నిర్మాణం చేపట్టాలి. కానీ గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ప్రస్తుత బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని 3.9 కిలోమీటర్ల వద్దనే వంతెన నిర్మాణానికి రూ.95.40 లక్షలు మంజూరు చేయించారు. 2018 నుంచి పనులు కొనసాగగా, అనేక మంది కాంట్రాక్టర్లు సైతం మారారు. గతేడాది మరో రూ.4.40 లక్షలు అదనంగా మంజూరు చేయడంతో పనులు ఎట్టకేలకు రెండు నెలల క్రితం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆ వంతెనపై నుంచి రైతులు పంట భూములకు వెళ్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తికావడంతో తమ కష్టాలు దూరమయ్యాయని, ఆనందంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. గ్రామం నుంచి వంతెన వరకు తారు రోడ్డు నిర్మాణం కూడ పూర్తయ్యింది.

ఇబ్బంది తొలిగింది



మా వ్యవసాయ భూముల్లోకి వెళ్లాలంటే తిరిగి పోవాల్సి ఉండేది. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో సులువుగా వెళ్లగలుగుతున్నాం. ఇన్నాళ్లపాటు మేము ఎదుర్కొన్న ఇబ్బందులు తొలిగాయి. ఊళ్లో నుంచి తోట్లోకి తొందరగా వెళ్తున్నాం.

– కంచెట్టి, రైతు, దూదిగాం

ప్రమాదాలు జరిగేవి



కాకతీయ కాలువ అవతలి వైపు ఉన్న భూముల్లోకి వెళ్లాలంటే జాతీయ రహదారి 44 నుంచి వెళ్లాల్సి ఉండేది. దీంతో రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ఇబ్బంది లేకుండాపోయింది. ఆనందంగా ఉంది.

– సత్యనారాయణ, రైతు, దూదిగాం

రామాలయాల్లో నేడు ప్రత్యేక పూజలు


బోధన్‌లోని శక్కర్‌నగర్ రామాలయం

బోధన్‌టౌన్/ఆర్మూర్‌టౌన్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా స్థానిక రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీ రామాలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శ్రీరాముని అభిషేకం, ప్రత్యేక పూజలు, అయోధ్య కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల అనంతరం అన్నప్రసాద వితరణ చేస్తామని, హిందువులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆర్మూర్ పట్టణంలోని రాంనగర్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు తెలిపారు. ఉదయం రాములవారికి ప్రత్యేక పూజలు, అన్నదానం, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగురవేయాలి


మాట్లాడుతున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ప్రతి హిందువు తమ ఇంటిపై కాషాయ జెండాను ఎగరవేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు కోరారు. ఆర్మూర్ పట్టణంలోని రామాలయంలో ఆదివారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల్లో భజనలు, సంకీర్తనలు చేయాలని, మధ్యాహ్నం 12గంటల నుంచి టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చూడాలన్నారు. సాయంత్రం ఇళ్ల ముందు కనీసం ఐదు దీపాలను వెలిగించాలన్నారు. ప్రతి హిందువు తమ వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలను స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఇందూర్ జిల్లా సహ సంయోజక్ గాజుల దయానంద్, జిల్లా ప్రచార ప్రముఖ్ బోచ్కర్ నిఖిల్, విశేష సంపర్క్ ప్రముఖ్ అక్షయ్, విశ్వహిందూ పరిషత్ ఆర్మూర్ నగర అధ్యక్షుడు గఠాడి గుండి చరణ్, కార్యదర్శి కొంగి రవి, బజరంగ్ దళ్ ఆర్మూర్ నగర సంయోజక్ కత్తి శీను, అజయ్, ప్రేమ్, పవన్, యోగేశ్వర ప్రసాద్, ప్రవీణ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతిని సహించేది లేదు


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

మాక్లూర్: తాను ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం అవినీతి, అక్రమాలను ప్రోత్సహించకుండా నిజాయితీతో ప్రజల అభివృద్ధికి పాటుపడుతానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంచంద్రాపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని ఆదివారం రాకేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. తనవల్ల పొరపాటున ఏదైన తప్పు జరిగితే తన దృష్టికి తీసుకురావాలని, సరిదిద్దుకుంటానే తప్ప ఎవ్వరిపై ద్వేషం పెంచుకోనని అన్నారు. ప్రజలు నిర్భయంగా తన వద్దకు రావొచ్చన్నారు. తనతో అయ్యే పనిని దగ్గరుండి చేసి పెడతానన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేద్దామని, అన్ని వర్గాల వారు కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో జె క్రాంతి, సర్పంచ్ కట్కం వెంకన్న, ఎంపీటీసీ పెద్దులు, బీజేపీ నాయకులు తొడు మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో వాలీబాల్ టోర్నీ

ఎడపల్లి(బోధన్): సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఎడపల్లి మండలంలోని పోచారంలో సర్పంచ్ కోల ఇంద్రకరణ్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీని ఆదివారం ప్రారంభించారు. కోల సుశీల, ప్రభుదాస్ జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.2222తోపాటు షీల్డ్, అలాగే రెండో బహుమతిగా రూ.1,111 నగదుతోపాటు షీల్డ్‌ను అందించనున్నారు.

పిరమిడ్ నిర్మాణానికి విరాళం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై కొనసాగుతన్న నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం నిర్మాణ పనుల కోసం పీఎస్ఎస్ఎం సభ్యులకు నందిపేట మండల చెందిన ఉపాధ్యాయులు గీత, నాగభూషణం రూ.50వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. అంతకు ముందు సీనియర్ పిరమిడ్ మాస్టర్ సుంక రమేశ్ ధ్యాన ఆత్మ జ్ఞానాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి, నల్ల గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రుద్రూర్: ఉమ్మడి కోటగిరి మండలంలోని పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ ఆర్డీవో భుజంగ్ రావు, తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ ఆదివారం సందర్శించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు ఎలా చేస్తున్నారని బీఎల్‌వోలను ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటరు జాబితాలో వారి పేర్లను నమోదు చేయించాలని సూచించారు. నిర్ధారణ చేసుకున్న తరువాత మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. వారివెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మహ్మద్ సయ్యద్ హుస్సేన్, సాయిలు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలి


టాస్ వేస్తున్న ప్రజాప్రతినిధులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జాన్కంపేట్‌లో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ విజయ, ఎంపీటీసీ సంజీవ్, మాజీ సర్పంచ్ బండారు దశరథ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జాన్కంపేట్ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గంగా కిశోర్, పార్టీ మైనార్టీ విభాగం గ్రామ అధ్యక్షుడు తాహెర్, యువకులు పెరిక రవి, చిలుక ప్రవీణ్, వీరవత్తిని రాజు, ఉప్పు రఘువరన్, పిట్ల రాము, దినేశ్, ఆర్గనైజర్లు రుక్మాయి హరీశ్, చిక్కల సృజన్ తదితరులు పాల్గొన్నారు.

'విజయసాయి'లో పేరెంట్స్‌డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని విజయసాయి పాఠశాలలో ఆదివారం హాస్టల్ పేరెంట్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ డ్యాన్సులతో అలరించారు. ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ విద్యార్థి గంగాప్రసాద్ మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు విజయసాయి అని, ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన తాను ప్రస్తుతం అమెరికా, భారత దేశంలో కంపెనీలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నానని వెల్లడించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఐఆర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


కళ్యాపూర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

రెంజల్(బోధన్): మండలంలోని కళ్యాపూర్‌లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ ప్రెసిడెంట్ నల్ల నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయతను, దేశభక్తిని పెంపొందించేందుకు యువత ముందుండాలన్నారు. ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ ఏడాది జాతీయ నాయకులను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 30 మంది యువకులు రక్తదానం చేసినట్లు తెలిపారు. దేశ భవిష్యత్తుకు యువత కీలకమన్నారు. రైతు సమన్వయ సమితి మండల మాజీ కన్వీనర్ కాశం సాయిలు, గంగోని వినోద్, మైని సంతోష్, శివకుమార్, కలేవార్ సంతోష్, సురేశ్, గాండ్ల మధు, సాయినాథ్, వేణు, గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వేంపల్లిలో ఊర పండుగ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఘనంగా ఊర పండుగ


ఊర పండుగలో పోతరాజు విన్యాసం

ముప్కాల్ మండలం వేంపల్లిలో ఆదివారం తెల్లవారుజాము నుంచే ఊరపండుగను ఘనంగా నిర్వహించారు. ఆరే పోశవ్వను ఊరేగించారు. పశువులు, పాడి, వ్యవసాయం బాగుండేలాని అమ్మవారిని కోరుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – బాల్కొండ

తొలి సోషలిస్టు సమాజ నిర్మాత లెనిన్



బోధన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు ఆర్మూర్‌లో..

బోధన్: ప్రపంచంలోనే కార్మిక, కర్షకవర్గ తొలి సోషలిస్ట్ సమాజ నిర్మాత మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బీ.మల్లేశ్ అన్నారు. లెనిన్ వర్ధంతిని ఆదివారం బోధన్ పట్టణంలోని తట్టికోట కాలనీలో సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా), ఆర్మూర్ పట్టణంలోని యానంగుట్ట కాలనీలో సీపీఎం, ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. లెనిన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, నాగమణి, సీతారాం, సాయిలు, ప్రభాస్, శంకర్, రాజు, లక్ష్మణ్, అరుణ, సాయవ్వ, గంగాధర్, సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, నాయకులు కుతాడి ఎల్లయ్య, న్యూడెమోక్రసీ నాయకులు భానుచందర్, గంజి రాము, గంగాధర్, రాజన్న, సుందరయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీ కమిటీ ఎన్నిక


ఎన్నికైన వారిని సన్మానిస్తున్న కాలనీవాసులు

మాక్లూర్: మండలంలోని ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కాలనీకి చెందిన డి.బాపురావు, సురేశ్‌రాజేందర్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. మొత్తం 226 ఓట్లకుగాను 117 ఓట్లు పోలయ్యాయి. డి.బాపురావు 49 ఓట్లు సాధించగా, సురేశ్ రాజేందర్ 129 ఓట్లు సాధించి అధ్యక్షుడిగా విజయం సాధించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రోహిత్, కోశాధికారిగా విఠల్ సుమ న్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన గోవింద్‌రెడ్డి, బాపురావు, అశోక్ ఎన్నికైన సభ్యులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎన్ రాజేశ్వర్‌రావు, శ్యామ గంగాధర్, రమేశ్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల ప్రదర్శన


ప్రదర్శనను తిలకిస్తున్న గ్రామస్తులు


ముక్కు నుంచి నీటిని తీసుకుని వదిలిపెడుతున్న దృశ్యం


తలపైన మంట పెట్టి టీ చేస్తున్న సాధనాశూరులు

రుద్రూర్: మండల కేంద్రంలో భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాధనాశూరుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సాధనాశూరుల కర్ర విన్యాసాలు, కనికట్టు ప్రదర్శనను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ప్రదర్శన ఏర్పాటు చేయగా, తిలకించేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వందల మంది చూస్తుండగానే తమ కనికట్టు విద్యతో సాధనాశూరులు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ముక్కు రంధ్రం నుండి నీటిని తీసుకుని మరో రంధ్రం ద్వారా వదలడం, తలపై మంటపెట్టి టీ చేయడం, మనిషిని మాయం చేయడం, రాళ్లను దేవతామూర్తులుగా మార్చడం తదితర విశేషాలను ప్రదర్శించారు.

పొంచి ఉన్న ప్రమాదం



భీమ్‌గల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కరెంట్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. వాటి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లల చేతికి అందే ఎత్తులో విద్యుత్ బాక్స్‌లో తెరిచి ఉన్నాయి. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.